
సాక్షి పల్నాడు


ఆదివారం । 19 । అక్టోబర్ । 2025

I



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం శనివారం 588.70 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 53,685 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 29,820 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 37,773 క్యూసెక్కు లు వదులుతున్నారు.



భక్తి సంగీత విభావరి

నగరంపాలెం(గుంటూరు): బృందావన్‌గార్డెన్స్ లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు.

న్యూస్‌రీల్

పులిచింతల ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్‌గా సూరజ్ గనోరే

జేసీకి అదనపు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం

నరసరావుపేట: జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు కేఎల్ రావుసాగర్ (పులిచింతల ప్రాజెక్ట్) ప్రత్యేక కలెక్టర్‌గా పూర్తి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీఓ జారీ చేసింది.

శివాలయంలో కార్తికమాస ఏర్పాట్లపై సమీక్ష



పెదకాకాని: కార్తిక మాసం సందర్భంగా పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తికమాస ఏర్పాట్లపై అర్చక స్వాములు, సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. భక్తుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు.

క్రీస్తు జయంతి జూబ్లీ వేడుకలకు సర్వం సిద్ధం



రెంటచింతల: క్రీస్తు జయంతి జూబ్లీ వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ. ఫాదర్ వైఎల్ మర్రెడ్డి అన్నారు. శనివారం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కానుకమాత కళావేదిక వద్ద క్రీస్తు జయంతి జూబ్లీ వేడుకల సందర్భంగా సమిష్టి పవిత్ర పూజాబలికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. గుంటూరు మేత్రాసన పీఠాధిపతులు మహోఘన డా.చిన్నాబత్తిని భాగ్యయ్య నేతృత్వంలో సమిష్టి పవిత్ర పూజాబలి సమర్పించడం జరుగుతుందన్నారు. పల్నాడు డీనరి పరిధిలో ఉన్న 14 విచారణలకు సంబంధించిన ఫాదర్లు, కన్య స్త్రీలు, భక్తులు పాల్గొంటారన్నారు.

మెడికల్ కాలేజీకి 420 హిస్టాలజీ స్లైడ్లు అందజేత



గుంటూరుమెడికల్: గుంటూరు మెడికల్ కాలేజీ అనాటమీ విభాగానికి 420 హిస్టాలజీ స్లైడ్లు అందజేశారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి స్లైడ్లను మణిపాల్ వైద్య విశ్వవిద్యాలయం నుంచి తెప్పించి, అనాటమీ విభాగానికి అందజేశారు. అనాటమీ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ ఈ హిస్టాలజీ స్లైడ్లు ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు, అనాటమీ పీజీ వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాక్టికల్ స్థాయిలో శరీర నిర్మాణాన్ని అర్థం చేసుకునేలా సదుపాయాలు మెరుగుపరచడం మా లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీజీ వైద్య విద్యార్థులు డాక్టర్ సుందరాచారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపల్ (అడ్మిన్) డాక్టర్ శ్రీధర్, అనాటమీ విభాగం సహా ఆచార్యులు, సహాయక ఆచార్యులు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి అభిషేకం



తెనాలి: చినరావూరులోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం నందీశ్వరునికి అభిషేకం చేశారు. ముందుగా అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ తదుపరి సోమేశ్వరునికి అభిషేకం, బాలాత్రిపురసుందరి దేవికి కుంకుమ అర్చన చేశారు. అనంతరం నందీశ్వరునికి అభిషేకం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యుత్ కష్టాలకు చెల్లు

విద్యుత్ ఎప్పుడు పోతుందో..ఎప్పుడు వస్తుందో తెలియదు...మరో వైపు లో ఓల్టేజీ సమస్య...ఇంకొకవైపు బిల్లు మోతతో వినియోగదారులు సతమతమవుతున్నారు. ఈ కష్టాలకు సోలార్‌తో చెక్ పెట్టనున్నారు. సోలార్ ఏర్పాటుచేసుకునే వారికి ప్రభుత్వం రాయితీ కల్పించడంతోపాటు ఆదాయం కూడా సమకూర్చనుంది.



వినియోగదారులకు అవగాహన కల్పించేలా ర్యాలీ చేస్తున్న విద్యుత్ శాఖాధికారులు



ఇంటిపై బిగించిన సోలార్ ప్యానెల్

- పీఎం సూర్యఘర్‌తో ఇంటింటా సౌర కాంతులు
- విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్యలకు చెక్
- రాయితీతో సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్
- జిల్లా వ్యాప్తంగా వినియోగదారులకు అవగాహన కల్పించేలా ర్యాలీలు

సత్తెనపల్లి: గృహ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను వాడితే అతి తక్కువ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు వెల్లడిస్తూ శనివారం జిల్లా వ్యాప్తంగా మున్సిపల్, మండల కేంద్రాల్లో రాయితీలతో కూడిన వివరాలు తెలిసేలా ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇంటి పైన కనీసం 10 చదరపు అడుగుల స్థలంలో వన్ కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకుంటే, విద్యుత్ ఉత్పత్తి చేసి నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తోంది. దీని ద్వారా విద్యుత్ ఆదా అవుతుందని ప్రయోజనాలపై విద్యుత్ శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది.

కిలోవాట్‌ల వారీగా రాయితీ సమాచారం...

కిలోవాట్‌లు	ఖర్చు	రాయితీ	యూనిట్లు
ఒకటి	రూ.83 వేలు	రూ. 30 వేలు	120
రెండు	రూ. 1,14,000	రూ. 60 వేలు	240
మూడు	రూ. 2,10,000	రూ. 78 వేలు	360

సోలార్ రాయితీలు ఇలా...

సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటులో భాగంగా ఒక కిలోవాట్‌తో 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతున్నందున, సాధారణంగా రూ.1,000 బిల్లు వచ్చే వినియోగదారునికి రూ.333 మాత్రమే వస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ ఇస్తుంది. రెండు కిలో వాట్‌లతో 240 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతున్నందున, సాధారణంగా రూ.2 వేలు బిల్లు వచ్చే వినియోగదారునికి రూ. 338 మాత్రమే వస్తుంది. దీనికోసం ప్రభుత్వం రూ.60 వేల రాయితీని అందజేస్తుంది. మూడు కిలోవాట్‌లతో 360 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతున్నందున, సాధారణంగా రూ.3 వేలు బిల్లు వచ్చే వినియోగదారునికి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుంది. ఇందు కోసం ప్రభుత్వం రూ.78 వేలు రాయితీని అందజేస్తోంది. దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు ఏపీ సీపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

పథకాన్ని ఇలా పొందవచ్చు...

- పీఎం సూర్యఘర్ యోజనను పొందేందుకు గృహ వినియోగదారులు వాడే విద్యుత్ యూనిట్లు 300లోపు ఉండాలి.
- సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- ఆన్‌లైన్‌లో వినియోగదారుడు వివరాలు నమోదు చేసుకోవాలి
- వరుసగా ఆరు నెలల బిల్లులను జత చేయాలి
- అవసరమైన కిలోవాట్‌ల ఆధారంగా రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.
- మూడు కిలోవాట్‌లలోపు సర్వీస్‌కు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఐదు కిలోవాట్‌లకు రూ.1,900, ఆపై రూ.5,900 చెల్లించాలి. 10 కిలోవాట్‌ల పై బడిన హెచ్‌టీ సర్వీస్‌లకు రిజిస్ట్రేషన్ ఫీజు రూపంలో రూ.11,900 చెల్లించాల్సి ఉంటుంది.
- సబ్సిడీ పోను మిగిలిన మొత్తానికి బ్యాంకులు రుణ సదుపాయాన్ని కల్పిస్తాయి. వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుంది.

అవకాశం వినియోగించుకోండి



పీఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపల్, మండల కేంద్రాల్లో శనివారం అవగాహనా ర్యాలీలు చేపట్టాం. విద్యుత్ బిల్లు ఆదా, కలిగే ఇతర ప్రయోజనాలను తెలియపరుస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు మీ పరిధిలోని సెక్షన్ కార్యాలయాల్లో సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలియజేస్తారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం.

– కె.రామసుబ్బారావు, ఈఈ టెక్నికల్, పల్నాడు జిల్లా

మర్యాదపూర్వక కలయిక





రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ బీ కృష్ణారావు

రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ నాగార్జునకొండ పర్యటనలో భాగంగా శనివారం తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా హిల్‌కాలనీకి కుటుంబ సమేతంగా వచ్చారు. గవర్నర్‌ను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ బీ కృష్ణారావు, గురజాల ఆర్డీఓ వి మురళీకృష్ణలు హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో గురజాల డీఎస్పీ జగదీష్, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, మాచర్ల టౌన్ సీఐ ప్రభాకర్, విజయపురిసౌత్ ఎస్‌ఐ అశోక్, పలువురు పోలీస్ శాఖ, రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.

– విజయపురిసౌత్

శుద్ధమైన వాయువు ఆరోగ్యానికి కీలకం

- జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా
- గ్రామంలో మొక్కలు నాటిన కలెక్టర్



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

పిడుగురాళ్ల: శుద్ధమైన వాయువు మన ఆరోగ్యానికి అంత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. పట్టణంలోని స్వచ్ఛమైన గాలి అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ కృతికా శుక్లా మొక్కలు నాటి ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాయు కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉందని, మొక్కలు నాటి, వాతావరణాన్ని హరితవనంగా మార్చాలన్నారు. భవిష్యత్ తరాలు స్వచ్ఛమైన గాలి పీల్చాలంటే మనం గాలిని కలుషితం చేయకూడదని దీనిని ప్రతి ఒక్కరూ దృష్టిలో పెట్టుకొని ముందుకు నడవాలన్నారు. ప్రజా సంఘాల వారు, స్వచ్ఛంద సంస్థల వారు ముందుకు వచ్చి ప్రజలకు అవగాహన కల్పించాలని, దీని ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించిన వారవుతారని అన్నారు. అనంతరం గుంటూరు జిల్లా పర్యావరణ ఇంజినీర్ సజీనా బేగం మాట్లాడుతూ వాహనాల పొగ, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య వాయువులు వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయన్నారు. దీపావళి సందర్భంగా పర్యావరణాన్ని కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందని అన్నారు. అనంతరం దీపావళి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఏపీపీసీబీ వారిచే రూపొందించబడిన ప్రత్యేక పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట సంబరాల్లో టీడీపీ నేతల వీరంగం

- సుంకం చెల్లిస్తేనే కార్యక్రమాలు జరపాలంటూ ఆదేశం
- పోలీసుస్టేషన్‌కు చేరుకున్న గ్రామస్తులు, మహిళలు
- సమస్య పరిష్కారానికి ఎస్‌ఐ హామీ
- వెనుదిరిగిన మహిళలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఐనవోలు ఎస్సై

సాక్షి టాస్క్‌ఫోర్స్: నూజెండ్ల మండలం పమిడిపాడు గ్రామంలో గ్రామ దేవత విగ్రహ ప్రతిష్ట సందర్భంగా టీడీపీ నాయకులు వీరంగం సృష్టించారు. గ్రామంలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గ్రామస్తులు విరాళాలు సేకరించారు. ప్రతిష్ట అనంతరం అన్నదాన సంతర్పణ సమయంలో గ్రామానికి చెందిన టీడీపీ నేత తన అనుచరులతో వచ్చి భోజనం చేస్తున్న వారితో ఘర్షణకు దిగాడు. అక్కడ ఉన్న నిర్వాహకులు ప్రతిష్ట సజావుగా జరగాలని ప్రాథేయ పడినప్పటికీ భోజనం బల్లలను, వంట సామగ్రి పడివేసి గందరగోళం సృష్టించాడు. అంతే కాకుండా గ్రామంలో ఎటువంటి కార్యక్రమం జరిగిన మాకు సుంకం చెల్లించాలని లేకుంటే కార్యక్రమాలు నిర్వహించటానికి వీల్లేదని హెచ్చరించారు. గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో వినుకొండ పట్టణంలో ఉన్న ఐనవోలు పోలీసుస్టేషనుకు చేరుకొని ఎస్‌ఐ ఎదుట మొరపెట్టుకున్నారు. గ్రామంలో టీడీపీ నేతల ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందని ఏ పని చేయాలన్నా సుంకం చెల్లించాలని లేకపోతే వేధింపులకు గురిచేస్తున్నారని ఎస్‌ఐ ముందు కన్నీటి పర్యంతమయ్యారు. శుక్రవారం రాత్రి సమయంలో మహిళలు పోలీసుస్టేషను ఎదుట రెండు గంటల నిరీక్షించారు. స్పందించిన ఎస్‌ఐ మీకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కారిస్తామని హామీ ఇవ్వటంతో గ్రామస్తులు తిరిగి గ్రామానికి వెళ్లారు.

నరసరావుపేటలో కాటికాపరి హత్య



ఘటనా స్థలంలో ఎఫ్రాన్ మృతదేహం

నరసరావుపేట రూరల్: కాటి కాపరి హత్యకు గురైన ఘటన నరసరావుపేట శివారులోని స్వర్గపురి–2లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని క్రిస్టియన్‌పాలెంకు చెందిన గాడిపర్తి ఎఫ్రాన్(31) కొంతకాలంగా స్వర్గపురి–2 శ్మశానవాటికలో కాటికాపరిగా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఎఫ్రాన్ స్వర్గపురి–2లో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నరికి చంపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరమణ, వన్‌టౌన్ సీఐ ఫిరోజ్‌ఖాన్, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ కిషోర్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. పాతకక్షల నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలి



కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

బాపట్ల: 'పరిశుభ్రత వైపు ఒక అడుగు' నినాదంతో స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలని, ప్రజారోగ్యం, పర్యావరణ స్థిరత్వం దిశగా ప్రతి అడుగూ కృత నిశ్చయంతో వేయాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ ఇన్‌చార్జి డీన్ ఎస్.ఆర్. కోటీశ్వరరావు తెలిపారు. ప్రతి నెలా మూడవ శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛాంధ్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యవసాయ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు ఈ సామాజిక ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. ప్రజా ఆరోగ్యానికి రక్షణగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణతో ప్లాస్టిక్ భూతాన్ని భూతలం నుంచి పారదోలాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల దాపురిల్లే భయంకరమైన పరిణామాల గురించి వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల వల్ల విలువైన పశుసంపద బలి కావడం దారుణమని తెలిపారు. దీని వల్ల పర్యావరణ సమతౌల్యత దెబ్బతింటుందని, యువత అప్రమత్తంగా ఉండి స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ సాధనకు కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణను విద్యార్థులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.రమాదేవి, సి.సంధ్యారాణి, జి.విజయకుమార్, షేక్ అబ్దుల్ సలాం, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.పది లక్షలిస్తే దుకాణం పదిలం!

- నగర పాలక సంస్థ అధికారుల బరితెగింపు
- కొల్లి శారద మార్కెట్ దుకాణాల కోసం వసూళ్లు
- న్యాయం చేయాలని వ్యాపారుల ఆందోళన



అన్నపూర్ణ కాంప్లెక్స్

సాక్షి ప్రతినిధి, గుంటూరు, నెహ్రూనగర్: కొల్లి శారద మార్కెట్ పాత లీజుదారుల పరిస్థితి దారుణంగా తయారైంది. మార్కెట్‌లో 25 సంవత్సరాలుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేసుకుంటున్న తమను లీజు గడువు పూర్తయిందంటూ హడావుడి చేసి బయటకు పంపారని కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముడుపులు ఇస్తే రెన్యూవల్?

ఈ మార్కెట్‌లో 81 షాపులు ఉన్నాయి. ఒక్కో దానికి రూ.10 లక్షల చొప్పున రూ.8.10 కోట్లు ఇస్తే రెన్యూవల్ చేస్తామని నగరపాలక సంస్థ అధికారులు మధ్యవర్తుల ద్వారా చెప్పారని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. అంత స్తోమత లేక అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారం చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇక్కడికి కూడా వచ్చి ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పక్క తాము రైతులను కొల్లి శారద మార్కెట్‌కు వెళ్లనివ్వడం లేదనడం సమంజసం కాదని వ్యాపారస్తులు వాపోతున్నారు. తాము ఆపితే వారు ఎలా ఆగుతారని.. ఇష్టపూర్వకంగా వస్తున్నారని వ్యాపారాలు చెబుతున్నారు.

లీజుకు ముందు చెప్పలేదు..

నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న పీవీకే నాయుడు మార్కెట్‌లో వ్యాపారం చేసుకుంటున్న వారిని నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా 1999లో అప్పటి నగర కమిషనర్ కృష్ణబాబు అక్కడి నుంచి పంపించేశారు. వారిని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ కొల్లి శారద మార్కెట్‌కు తరలించారు. మార్కెట్‌కు వెళ్లే ముందు లీజు గడువు విషయం తమకు చెప్పకపోవడంతో 25 సంవత్సరాలుగా కార్పొరేషన్‌కు అద్దెలు చెల్లిస్తూ వ్యాపారాలు చేసుకుంటున్నామని వ్యాపారులు తెలిపారు. ఈ క్రమంలో 2013లో జీఓ వచ్చిందని నగరపాలక సంస్థ అధికారులు హడావుడిగా షాపులను ఖాళీ చేయాలని, బహిరంగ వేలం పెట్టాలని చెప్పారు. మరో పక్క ప్రస్తుతం ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండటంతో పోలీసులు ఇబ్బందులను తట్టుకోలేక బుడంపాడు బైపాస్ వద్ద 4 ఎకరాల స్థలం కొనుగోలు చేశామన్నారు. అనుమతులు ఇవ్వాలని నగరపాలక సంస్థ అధికారులను కోరినా కుదరదన్నారని చెప్పారు. కనీస వసతులు కూడా కల్పించలేమని తెలిపినట్లు పేర్కొన్నారు. లీజు గడువు పూర్తయిందని హడావుడిగా వేలం పాట పెట్టేశారన్నారు. ఒక్కో షాపు రూ.లక్ష నుంచి రూ.6.50 లక్షల వరకు పలికిందని చెప్పారు అంత పెట్టి వ్యాపారం చేయలేమని బుడంపాడు బైపాస్ వద్ద ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్‌లోకి వెళ్లామన్నారు. వ్యాపారం చేయడానికి వీల్లేదని అధికారులు ఇబ్బంది పెడుతున్నట్లు వాపోయారు.



బైపాస్‌పై ఆగి ఉన్న కూరగాయల లోడు లారీ

ప్రత్యామ్నాయం చూపాలి

రూ.లక్షలు కట్టి తాము కొల్లి శారద మార్కెట్‌లో వ్యాపారం చేసుకునే పరిస్థితులు లేవని వ్యాపారులు తెలిపారు. తాము ప్రైవేట్ స్థలంలో వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని అధికారులు చెప్పడంతో మార్కెట్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. ఇంత వరకు స్పందన లేదని చెప్పారు. అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారం చేసుకోనివ్వడం లేదని వాపోయారు.

21 నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు

నరసరావుపేట రూరల్: స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా జిల్లా, డివిజన్ స్థాయి ఆటల పోటీలు ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు ఎస్.సురేష్‌కుమార్, వి.పద్మావతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–14, అండర్–17 బాలుర, బాలికల బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు 21వ తేదీ చిలకలూరిపేట ఏఎంజీ స్కూల్‌లో జరుగుతాయని తెలిపారు. యడ్లపాడు మండలం సొలస గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో డివిజన్ స్థాయి అండర్–14, అండర్–17 బాల, బాలికల వాలీబాల్ పోటీలు ఉంటాయని వివరించారు. 23వ తేదీ వినుకొండ లయోల హైస్కూల్‌లో డివిజన్ స్థాయి అండర్–14 బాల, బాలికల ఖోఖో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు.

డీజిల్ ట్యాంక్ పేలి కంటైనర్ దగ్ధం



యద్దనపూడి: టైరు పేలి కంటైనర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టటంతో డీజిల్ ట్యాంక్ పగిలి దగ్ధమైన సంఘటన తాతపూడి వద్ద శనివారం చోటు చేసుకుంది. హైవే మొబైల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళగిరి నుంచి చెన్నై పేపర్ లోడుతో వెళుతున్న కంటైనర్ టైరు తాతపూడి వద్దకు రాగానే ఒక్కసారిగా పేలింది. దీంతో అదుపుతప్పిన వాహనం డివైడర్‌ను ఢీకొనడంతో డీజిల్ ట్యాంక్ నుంచి మంటలు రేగాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ప్రాణ నష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

రైల్వే జనరల్ టికెట్ల కొనుగోలుకూ యాప్



లక్ష్మీపురం: రైల్వే శాఖ 2018లో జనరల్ ప్రయాణికుల కోసం యూటీఎస్ యాప్ తెచ్చిందని అధికారులు తెలిపారు. డివిజన్లలో పూర్తిస్థాయిలో వినియోగించేలా ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు గుంటూరు రైల్వే డీఆర్ఎం సుథేష్ట సేన్ గుంటూరు పట్టాభిపురంలోని తన కార్యాలయంలో శుక్రవారం యాప్ లోగో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాప్ వినియోగం గురించి ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో సీజన్, ప్లాట్‌ఫారం, సాధారణ ప్రయాణ టికెట్లను కూడా బుక్ చేసుకోవచ్చన్నారు. సీజన్ టికెట్‌ల రెన్యూవల్ ముందుగానే చేసుకోవచ్చని సూచించారు. డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్ బాబులు దీనిపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

చిట్టీల పేరిట మోసంపై మహిళల ఆందోళన



లక్ష్మీపురం: చిట్టీల పేరుతో రూ.2 కోట్ల మేరకు మోసం చేసిన మహిళపై చర్యలు చేపట్టాలని బాధితులు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ఏటీఅగ్రహారం 13వ లైన్ ప్రాంతానికి చెందిన అన్నపూర్ణ అలియాస్ చిన్నారి అనే మహిళ చిట్టీలు నిర్వహించేది. మహిళలు, పురుషులతో ఆమె వద్ద చిట్టీలు కట్టారు. మొత్తం రూ.2 కోట్ల వరకు కాజేసి పరారైంది. శనివారం బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలంటూ కోరారు.

పలు పంటల సాగుతో రైతు పదిలం

ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం డాక్టర్ కె అమలకుమారి



కొత్తపాలెం గ్రామంలోని పలు పంటల సాగును పరిశీలిస్తున్న ప్రకృతి సాగు విభాగం డీపీఎం డాక్టర్ కె అమలకుమారి

యడ్లపాడు: వ్యవసాయంలో అన్నదాత నష్టపోకూడదంటే పాత మూస పద్ధతులు, ఏక పంటపై ఆధారపడటం సరికాదని, పలు పంటల విధానమే రైతుకు పదిలం అని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కె అమలకుమారి పేర్కొన్నారు. యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతులు సాగు చేసిన పలు రకాల పంటలను సిబ్బందితో కలిసి ఆమె శనివారం పరిశీలించారు. పలు పంటల సాగు చేస్తున్న రైతులు తిరుపతిరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావుల కంపోస్ట్ బ్లాక్‌లను పరిశీలించారు. ముఖ్యంగా రైతు వెంకటేశ్వరరావు తన పొలంలో ప్రధాన పంటగా దొండసాగులో, అంతర పంటలుగా బెండ, గోరుచిక్కుడు, పప్పు చిక్కుడు, టమాటా, వంకాయ, సొరకాయ, ఉల్లి, కాకర, పొట్లకాయ, బంతి వంటి పదికి పైగా కూరగాయలు సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. బహుళ పంటల సాగు విధానం ద్వారా తాను నెలకు రూ.29,500 స్థిర ఆదాయం పొందుతున్నట్లు రైతు వెంకటేశ్వరరావు డీపీఎంకు తెలిపారు. ప్రకృతి సేద్యంతో పండిన కూరగాయలతో తమ కుటుంబం ఆరోగ్యంగా ఉండటంలో పాటు సాగు చేసిన నేల కూడా సారవంతంగా మారిందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం డీపీఎం అమలకుమారి రైతులతో మాట్లాడుతూ పలు పంటలు సాగు చేయడం వలన నేలలో జీవవైవిధ్యం పెరిగి భూసారం మెరుగుపడుతుందని, సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది పంటలకు పోషకాలు లభిస్తాయని, తద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని ఆమె వివరించారు. అందుకే భూ మాతకు పలు పంటలు ముద్దు, ఏకపంట వద్దు అంటూ కీలక సూచనలు చేశారు. ప్రకృతి సాగు విధానంతో రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి, ఘన, ద్రవ జీవామృతాలు, పశువుల పేడ, మూత్రం, సహజ అవశేషాలను వినియోగించడం ద్వారా రైతులకు సాగు పెట్టుబడి గణనీయంగా తగ్గి, అధిక ఆదాయం పొందవచ్చన్నారు. అన్నింటికీ మించి పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రకృతి సేద్యం విస్తరించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పలు పంటల సాగు రైతు జీవనాన్ని వెలుగులోకి తెస్తుందని ఆమె భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఈ విధానంతో ఆదర్శంగా నిలుస్తున్న రైతుల్ని అభినందించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ గడువు పొడిగింపు



ఎల్.చంద్రకళ, డీఈఓ

నరసరావుపేట ఈస్ట్: దేశ వ్యాప్తంగా డిసెంబర్ 7వ తేదీన నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్స్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష రుసుం చెల్లించేందుకు ఈనెల 27వ తేదీ వరకు గడువు పొడించినట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ వెబ్‌సైట్ www.bre.ap.gov.in అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ అనంతరం సంబంధిత ప్రింటెడ్ నామినల్ రోల్స్‌ను ఈనెల 29వ తేదీ లోగా డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. విద్యాశాఖాధికారి లాగిన్‌లో దరఖాస్తును ఈనెల 31వ తేదిలోగా ధృవీకరించాల్సి ఉందని తెలిపారు. గడువు పొడగింపునకు ఇదే చివరి అవకాశంగా గుర్తించాలని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ప్రాథమికోన్నత, ఎయిడెడ్, వసతి లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను తప్పనిసరిగా ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి తగిన విధంగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. దరఖాస్తు నమోదులో ఆధార్ కార్డులో ఉన్న విధంగా విద్యార్థి పేరు నమోదు చేయాలన్నారు. దరఖాస్తు చేసేందుకు ఎటువంటి ధృవపత్రాలు అవసరం లేదనీ, పరీక్ష రాసే సమయంలో అన్ని ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలని తెలిపారు. వివరాలకు ప్రభుత్వ వెబ్‌సైట్, డీఈఓ కార్యాలయంలోని డిఎస్‌ఓ పి.శంకరరాజు (9963192487)ను సంప్రదించాలని తెలిపారు.

సంస్కృతాంధ్ర పండితుడు జన్నాభట్ల మృతి



నరసరావుపేట ఈస్ట్: సంస్కృతాంధ్ర పండితుడు, రంగస్థల నటులు జన్నాభట్ల లక్ష్మీనారాయణ (65) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. జన్నాభట్ల వినుకొండ నుంచి ద్విచక్ర వాహనంపై నరసరావుపేట వస్తుండగా పట్టణం సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన జన్నాభట్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి 9 గంటల సమయంలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సంస్కృతం, తెలుగు భాషా పాండిత్యం గల లక్ష్మీనారాయణ పట్టణంలోని పలు కళాశాలల్లో మూడు దశాబ్దాలకు పైగా సంస్కృతాంధ్ర పండితునిగా సేవలు అందించారు. కొంతకాలం నాగార్జున విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యునిగా పనిచేశారు. రంగస్థల నటునిగా వివిధ పాత్రలకు జీవం పోశారు. జన్నాభట్లకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. పట్టణంలోని అధ్యాపకులు, కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, రంగస్థల కళాకారులు జన్నాభట్లకు నివాళులర్పించారు.

బైక్ అదుపు తప్పి వైద్యుడి మృతి




తరిగొప్పుల: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో ఒప్పిచెర్ల గ్రామానికి చెందిన మాచర్ల రవికిషోర్ (31) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రవికిషోర్ గురువారం తన స్వగ్రామం ఒప్పిచెర్లకు వెళ్లి కారంపూడిలో కొత్త బైక్ కొన్నాడు. శుక్రవారం అదే బైక్‌పై తిరిగి మంచిర్యాలకు వస్తున్న క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అక్కరాజుపల్లి క్రాస్‌రోడ్ సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో అతడి తల, ఛాతీ భాగంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య హిమబిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కాసర్ల రాజయ్య తెలిపారు.

బెంగళూరులో ఇసుకదర్శి వాసి ఆత్మహత్య

మార్టూరు: మండలంలోని ఇసుకదర్శి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం బెంగళూరులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వెంకట రమణయ్య (65) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో 15 రోజుల కిందట బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న కుమార్తె వద్దకు వెళ్లాడు. అక్కడ ఉదయం నిద్ర లేచేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడటం గమనించిన కుమార్తె స్వగ్రామంలో బంధువులకు సమాచారం అందించింది. మృతదేహాన్ని సాయంత్రం అక్కడకు తరలించారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురకాయపాలెం పాఠశాలలో శనివారం 356 మంది విద్యార్థినులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో 10 వేల సైకిళ్లు పంపిణీ చేయాలని సంకల్పంతో ఉన్నట్లు తెలిపారు. అనంతరం కొరిశపాడు మండలం మేదరమెట్లలో ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. అనంతరం మేదరమెట్ల–తమ్మవరం బీటీ రహదారిని ప్రారంభించారు. కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గటం వల్ల గృహోపకరణాల ధరలు తగ్గాయి

- సోలార్ ఏర్పాటు చేసుకునే వారికి ప్రయోజనం
- అవగాహన ర్యాలీ నిర్వహించిన విద్యుత్‌శాఖ అధికారులు



ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా అధికారి విజయకుమార్

నరసరావుపేట: సూపర్ సేవింగ్స్–సూపర్ జీఎస్టీ వల్ల విద్యుత్ గృహోపకరణాల ఉపకరణాల ధరలు తగ్గాయని, సోలార్ విద్యుత్తు పెట్టుకునేందుకు ముందుకు వచ్చే వారికి లాభం కలుగుతుందని విద్యుత్ శాఖ జిల్లా అధికారి డాక్టర్ ప్రత్తిపాటి విజయకుమార్ పేర్కొన్నారు. శనివారం సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్, సోలార్ విద్యుత్ అవగాహన ర్యాలీకి స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో పచ్చ జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ర్యాలీ శివుడు బొమ్మ సెంటర్ మీదుగా ప్రధాన రహదారిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్ వరకు, అక్కడి నుంచి పాండురంగస్వామి దేవాలయం మీదుగా కోట సెంటర్ నుంచి విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు కొనసాగింది. విద్యుత్ శాఖ సిబ్బంది ప్లకార్డులు పట్టుకొని దారి పొడవునా కరపత్రాలు పంపిణీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్.రాంబొట్లు మాట్లాడుతూ విద్యుత్ రంగ సంస్థలో గృహ వినియోగదారులకు అదనపు లోడు ఉంటే 50 శాతం రాయితీ ద్వారా లోడు క్రమబద్ధీకరణ పథకం ఉందని, దీనిని ప్రతి ఒక్క గృహ వినియోగదారుడు వినియోగించుకోవాలని కోరారు. ర్యాలీలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్లు రఫీ, సురేంద్రబాబు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు సాంబశివరావు, మౌళి, ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా బాధ్యుల నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా సోషల్ మీడియా విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో పలువురిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా ఉపాధ్యక్షులుగా నన్నపునేని వెంకటరావు (వినుకొండ), జక్కిరెడ్డి నాగిరెడ్డి (మాచర్ల), షేక్ మాబు జానీ(గురజాల), జేఎస్‌కే జానీ (సత్తెనపల్లి), ప్రధాన కార్యదర్శులుగా గెల్లి మల్లికార్జునరెడ్డి(నరసరావుపేట), గుడిసె నాగిరెడ్డి (పెదకూరపాడు), చిన్నపురెడ్డి సునీల్‌రెడ్డి (చిలకలూరిపేట), కార్యదర్శులుగా డి.శివకేశవలింగం(సత్తెనపల్లి), పఠాన్ షారూక్‌ఖాన్(పెదకూరపాడు), అన్నపురెడ్డి రణధీర్‌రెడ్డి (మాచర్ల), కొండవజ్జు వెంకటసుబ్రమణ్యం(వినుకొండ), షేక్ కరిముల్లా (నరసరావుపేట), షేక్ బాషా (చిలకలూరిపేట), ఇర్ల వెంకటశివ (గురజాల) నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా షేక్ నాగూల్‌మీరా, ఆరేటి మల్లికార్జున (సత్తెనపల్లి), బొమ్మిరెడ్డి గోపీనాథరెడ్డి, చాదాపొంగు అరుణ(గురజాల), కారసాల రత్నకుమార్, షేక్ సాబువర్మ (చిలకలూరిపేట), తిగురి తిరుపతిరెడ్డి, బొబ్బా రాజశేఖరరెడ్డి, చల్లా శివారెడ్డి (మాచర్ల), ఫణిదెపు మంగారావు, దొరొట్ల రవి (వినుకొండ), మక్కిన ఉదయ్, మార్కాపుడి ధనుష్(పెదకూరపాడు), విరామరాజు సాయికృష్ణ (చెర్రీ), పోలం బ్రహ్మారెడ్డి (నరసరావుపేట) నియమితులయ్యారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు, ఎస్ఐ సీహెచ్ నాగార్జున

రెంటచింతల: రెంటచింతల పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐకి సూచించారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వల్ల జరిగే ప్రమాదాలతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. గ్రామాలలో చిన్న చిన్న విషయాలకే ప్రజలు ఆవేశంతో ఘర్షణ పడుతున్నారన్నారు. ఏ ప్రాంతంలోనైనా గొడవ జరుగుతుందని తెలిసిన వెంటనే పోలీసులు వారిని స్టేషన్‌కు పిలిపించి మాట్లాడి సర్దుబాటు చేయడంపై కూడా దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ సీహెచ్ నాగార్జున పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ స్పందించకపోవడం బాధాకరం


బాధిత కాపు కుటుంబానికి న్యాయం చేయాలి



బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేస్తున్న కాపు సంఘ నాయకులు

వినుకొండ: నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కాకర్ల హరిశ్చంద్రప్రసాద్ చేతిలో హత్యకు గురైన కాపు సామాజిక వర్గానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబానికి న్యాయం చేయాలని కాపు సంఘం నాయకులు కోరారు. వినుకొండ నియోజకవర్గం కాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద మీడియాతో మాట్లాడారు. నిందితులకు కఠినంగా శిక్షపడేలా పూర్తిస్థాయిలో సీబీసీఐడీ ద్వారా విచారణ జరిపి చార్జిషీట్ దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్, ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి, హోంమంత్రులను కోరనున్నట్లు తెలిపారు. తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలన్నారు. లక్ష్మీనాయుడు భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, దాడిలో గాయపడిన పవన్, భార్గవ్‌ల వైద్య ఖర్చులతోపాటు వారిరువురికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి వారికి ఇంటి స్థలం కేటాయించాలన్నారు. లక్ష్మీనాయుడు పిల్లల చదువుల నిమిత్తం వారికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో కాపులు పెద్దన్న పాత్ర పోషించి కూటమిని గెలిపించాలని కోరిన పవన్ కల్యాణ్ మాటలు విని కాపులు ఓట్లేస్తే కాపులపై ఇంత దారుణంగా దాడులు జరుగుతుంటే పవన్ కల్యాణ్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కాపు యువసేన రాష్ట్ర అధ్యక్షుడు కర్ణా శ్రీనివాసరావు, నాయకులు మల్లిశెట్టి నరేష్, మారాసు వీరేంద్ర, పత్తి మణికంఠ, బండ్ల శ్రీను, ఓబులశెట్టి పిచ్చయ్య, సూరే ప్రసాద్ తిరుమలశెట్టి కొండలు, ఆసా మనోహర్, కందా వెంకటేశ్వర్లు (బాబు), మారాసు కొండలు, తాడి అమర్, నియోజకవర్గ కాపు నాయకులు పాల్గొన్నారు.

దేశ బలోపేతానికి ఎల్ఐసీ కీలకం



మాట్లాడుతున్న జోనల్ అధ్యక్షులు సతీష్, వేదికపై మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

కొరిటెపాడు(గుంటూరు): ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ 57వ మహాసభలు శనివారం స్థానిక ఎన్‌జీఓ కల్యాణ మండపంలో జరిగాయి. జోనల్ అధ్యక్షులు పి.సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల స్వదేశీ నినాదమిచ్చిన కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో విదేశీ ఈక్విటీని వంద శాతానికి పెంచాలని నిర్ణయించడం దేశ ప్రయోజనాలకు హానికరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ బీమా ఉద్యోగులు సంస్థలను కాపాడుకునేందుకు సమైక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, ఎల్ఐసీ ఆఫీసర్స్ ప్రధాన కార్యదర్శి కోటేష్ బాబు, డెవలప్మెంట్ అధికారుల కార్యదర్శి సురేష్ బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్, మహిళా కన్వీనర్ సీహెచ్ మధుబాల తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో బాల కళాప్రభ ఉత్సవాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న రాధాకృష్ణమూర్తి, గురుదత్, రాజేష్, ఉమాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: బాలనంద కేంద్ర ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు రుద్ర కళాక్షేత్రం సహకారంతో 'బాల కళాప్రభ–2025 పేరుతో రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవ, పోటీలను నవంబర్ 8, 9వ తేదీల్లో నిర్వంచనున్నారు. బాలానంద కేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, నడింపల్లి వెంకట గురుదత్‌లు ఈ మేరకు పేర్కొన్నారు. శనివారం బ్రాడీపేట రెండో లైను లోటస్ ఆద్య పాఠశాలలో కార్యక్రమాల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రుద్ర కళాక్షేత్రం నిర్వాహకుడు మాచిరాజు రాజేష్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని ఔత్సాహిక కూచిపూడి నృత్య విద్యార్థులను ప్రోత్సహించేందుకు నృత్య ప్రభ (సోలో), నృత్యమణి ((గ్రూపు) పేరుతో పోటీలు నిర్వహిస్తామన్నారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు, తెలుగు పద్యం, సంస్కృత శ్లోకం, తెలుగులో మాట్లాడదాం, చిత్రలేఖనం, రంగులు వేద్దాం రండి, శాస్త్రీయ గాత్ర సంగీతం, లలిత గీతాలు, వాద్య సంగీత పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా అంశాల్లో జూనియర్, సీనియర్ విభాగాలుగా పోటీలను నిర్వహించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని వివరించారు. 91826 85890, 89199 81839, 90300 88020, 738215 3390 ఫోను నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లోటస్ ఆద్య పాఠశాల అకడమిక్ డైరెక్టర్ వై.ఉమాదేవి, పి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యద్దనపూడి: అప్పులు తీర్చలేక మనోవేదనకు గురై జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చింతపల్లిపాడులో చోటు చేసుకుంది. చింతపల్లిపాడు ఎస్సీ కాలనీకి చెందిన బత్తుల చిట్టిబాబు (46) భార్య 2015లో మరణించింది. దీంతో ఇద్దరు సంతానంతో తల్లి వద్దే ఉంటున్నాడు. చిట్టిబాబు కొంత పొలం కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాడు. పిల్లల చదువు కోసం, వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుమందు తాగాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు చిలకలూరిపేట ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని సోదరుడు చినభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రత్నకుమారి తెలిపారు.